క్లుప్తంగా...

కేసీఆర్ స్పోర్ట్స్ కిట్ల పంపిణీ



పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డుకు చెందిన యువతకు కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లను కౌన్సిలర్ చింతల రాజశేఖర్ ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కిట్లను వినియోగించుకొని క్రీడా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో యువజన సంఘాల నాయకులు, ఎల్ఎన్ కాలనీవాసులు పాల్గొన్నారు.

సాఫ్ట్ స్కిల్ ఫర్ సక్సెస్ బుక్‌ను ఆవిష్కరించిన మంత్రులు



ఘట్‌కేసర్: ప్రముఖ మానసిక వ్యక్తిత్వ నిపుణులు డాక్టర్ మహిపతి శ్రీనివాస్‌రావు రాసిన 'సాఫ్ట్ స్కిల్ ఫర్ సెక్సెస్' పుస్తకాన్ని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు, మంత్రి మల్లారెడ్డి, అనురాగ్ యూనివర్సిటీ(ఏయూ)లో చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలిసి మంత్రి కార్యాలయంలో ఆవిష్కరించారు.రచయిత శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో లక్ష్య సాధనకు ఈ పుస్తకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

అంబేడ్కర్‌ను నిత్యం స్మరించుకోవాలి



ఘట్‌కేసర్: ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశానికి రాజ్యాంగం అందించిన అంబేడ్కర్‌ను నిత్యం స్మరించుకోవాలని కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆదివారం నిర్వహించిన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్వాతంత్ర్యం భారతదేశానికి దిశా నిర్దేశం చూపిన మహానేత అని కొనియాడారు. కార్యక్రమంలో అరుణ్‌కుమార్, దాసు, మల్లేశ్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

డ్రైనేజీ సీసీరోడ్డుపనులు ప్రారంభం



కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు ఓల్డ్‌విలేజ్‌లో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీరోడ్డుపనులను ఆదివారం మున్సిపల్ చైర్మెన్ కౌకుట్లచంద్రారెడ్డి ప్రారంభించారు. వివిధ వార్డుల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ బండారి మల్లేష్ యాదవ్, కౌన్సిలర్ సుర్వీ శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

జవహర్‌నగర్: జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అంబేడ్కర్‌నగర్ సండే మార్కెట్ ప్రాంతంలో శాగంటి ప్రవీణ్‌కుమార్ (31) నివాసముంటున్నాడు.కొంత కాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 6వ తేదీన భువనగిరిలో పనికోసమని వెళ్లి ఇంతవరకు తిరిగిరాలేదు. ప్రవీణ్‌కుమార్ ఆచూకీ కోసం తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మీరే పోటీలో ఉన్నట్లుగా భావించి గెలిపించండి

మల్కాజిగిరి: ఈ సారి జరిగే ఎన్నికల్లో మీరే పోటీలో ఉన్నట్లుగా భావించి గెలిపించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కోరారు. మల్కాజిగిరి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జీడి సంపత్‌గౌడ్ ఆధ్వర్యంలో డివిజన్ నాయకులు పరిచయ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమన్నారు. రెండు నెలలు ఓపిక పట్టాలని మీ సమస్య నా సమస్యగా భావించి పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్‌యాదవ్, జీడి సత్యనారాయణగౌడ్, సిరిగిరి నర్సింగరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు...తప్పని వెతలు

- 6 మండలాల్లో 11 రోజులుగా సమ్మె చేస్తున్న వంట కార్మికులు
- అందని పెంచిన వేతనాలు.. పెండింగ్ బిల్లులు
- పెరిగిన ధరలకు తగ్గట్టుగా మెనూ చార్జీలు పెంచాలని ఆందోళన



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ పాఠశాలలలో మధ్యాహ్న భోజన వంట కార్మికుల సమ్మెతో విద్యార్థులు అర్ధాకలితో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. పెంచిన వేతనాలు చెల్లించడంతో పాటు మెస్, కోడిగుడ్లు, బిల్లులను సకాలంలో చెల్లించాలని డిమాండ్ చేస్తూ ... మేడ్చల్ జిల్లా పరిధిలోని ఆరు మండలాలల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వంట కార్మికులు 11 రోజులుగా ఆందోళనకు దిగటంతో వంట బంద్ కావటంతో విద్యార్థులు ఆకలి సమస్యను ఎదుర్కొంటున్నారు. జిల్లాలో ప్రధానంగా మేడ్చల్,మల్కాజిగిరి,ఘట్కేసర్,శామీర్‌పేట, అల్వాల్ మండలాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వంట వండేవారే లేకుండా పోయారు. మధ్యాహ్న భోజనం వంట చేస్తున్న దాదాపు 120 మంది కార్మికులు సమ్మె బాట పట్టటంతో పాఠశాలల్లో పొయ్యిలు వెలగకపోగా, పలువురు విద్యార్థులు ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనాన్ని తింటున్నారు. మిగిలిన విద్యార్థులు మధ్యాహ్న సమయంలో ఇంటి బాట పడుతున్నారు.

బడుల్లో ప్రత్యామ్నాయ చర్యలు

సమ్మె నోటీసును ముందస్తుగానే మధ్యాహ్న భోజన కార్మికులు జిల్లా విద్యాశాఖకు అందజేయగా, సంబంధిత అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. అయితే మధ్యాహ్న భోజనం వంట చేసేందుకు ప్రత్యామ్నాయ దారి లేకపోవడంతో విద్యార్థులను ఇళ్ల నుంచే భోజనం తెచ్చుకోవాలని, బడికి సమీపంలోని వారు ఇళ్లకు వెళ్లి తిని రావాలని ప్రధానోపాధ్యాయులు ముందస్తుగానే విద్యార్థులకు సూచనలు జారీ చేశారు. కొన్ని పాఠశాలల్లో మాత్రం ప్రధానోపాధ్యాయులు హెల్పర్లు, ప్రైవేటు వ్యక్తుల సాయంతో మధ్యాహ్న భోజనం వంట చేయించి విద్యార్థులకు అందిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మెజారిటీ పాఠశాలల్లో వంట చేసే వారు లేని కారణంగా విద్యార్థులు ఇంటి భోజనంపైనే ఆధారపడ్డారు. ఫలితంగా గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో మధ్యాహ్న సమయంలో విద్యార్థుల హాజరు కొంత తగ్గింది. ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుతూ సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థులు మాత్రం వసతి గృహాల్లోనే మధ్యాహ్న భోజనం వంట చేయించి పెడుతున్నారు. భోజనాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డీఈవో సూచించిన నేపథ్యంలో అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మండల విద్యాధికారులు పేర్కొంటున్నారు.

సత్వర వైద్య సేవలందిస్తున్నాం



మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి, తదితరులు

శామీర్‌పేట్: తెలంగాణ ప్రజలకు సత్వర వైద్యసేవలు అందిస్తున్నామని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మూడుచింతలపల్లి మండలం. కేశ్వాపూర్, ఉద్దమర్రి గ్రామాల్లో జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్మించిన బస్తీ దవాఖానాలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఉద్దమర్రిలో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ హయాంలో ప్రతీ గ్రామంలో దవఖానా ను ఏర్పాటు చేసి వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ శ్రీనివాస్, ఎంపీపీ హారిక, డీసీఎంఎస్ వైస్‌చైర్మెన్ మధుకర్‌రెడ్డి, సర్పంచ్ ఇస్తారి, ఎంపీటీసీ నాగరాజు, పలువురు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో మంత్రి చామకూర మల్లారెడ్డి తన సొంత నిధులతో సీసీ రోడ్ల నిర్మాణాలను చేపట్టేందుకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న పనులను పరిశీలించారు. భవానీనగర్, ప్రగతినగర్ కాలనీల్లో సీసీ రోడ్లకు భూమి పూజ చేశారు.

భవన నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

శామీర్‌పేట్: ఎల్లపు సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తామని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. తూంకుంట మున్సిపాలిటీ , ఉప్పరిపల్లిలో రూ. 1 కోటి ప్రభుత్వ నిధులతో నిర్మించనున్న రాష్ట్ర ఎల్లపు సంఘం ఆత్మగౌరవ నూతన భవన నిర్మాణానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేంకటేశ్వరరావుతో కలిసి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఈ భవనాన్ని నిర్మించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేంకటేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు భీమ్‌సేన్, మాజీ ఎమ్మెల్యే లక్ష్మణ్, డీసీఎంఎస్ వైస్‌చైర్మెన్ మధుకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ బైక్ ర్యాలీ



కీసర: నాగారం మున్సిపల్ పరిధిలోని సుమారు 22 కాలనీవాసులు ఎదుర్కొంటున్న వరదముంపు, మురుగునీటి సమస్యకు పాలకులు శాశ్వతప్రాతిపదికంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఆదివారం 22 కాలనీల వరద ముంపు ప్రాంతాల జేఏసీ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీని నిర్వహించారు. ఈసందర్భంగా జేఏసీ నేతలు జయకుమార్, రవీందర్, తదితరులు మాట్లాడుతూ నాగారం మున్సిపాలిటీలో సరైన మురుగునీటి వ్యవస్థలేదని , దీనికి తోడు జవహర్‌నగర్ డంపింగ్‌యార్డు, దమ్మాయిగూడ మున్సిపాలిటీ తదితర ప్రాంతాల నుండి మురుగునీరంతా నాగారం మున్సిపల్‌పరిధిలోకి వచ్చిచేరుతుందన్నారు. వర్షం వస్తే కాలనీలు జలమయమవుతాయన్నారు. తమ సమస్యను పరిష్కారం లభించేంత వరకు వివిధ రూపాల్లో పోరాటం కొనసాగిస్తామన్నారు. ఎన్నికలలోపు తమకు న్యాయం జరగాలని కోరారు.

23వ వార్డులో అభివృద్ధి పనులకు శ్రీకారం



మేడ్చల్: పట్టణంలోని 23వ వార్డులో అభివృద్ధి పనులకు మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక నర్సింహ్మారెడ్డి శ్రీకారం చుట్టారు. వార్డులో రూ.34లక్షలతో నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ పనులకు ఆమె పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులను ప్రారంభించారు. వార్డులో సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీల నిర్మాణం, వీధీ దీపాల ఏర్పాటు ఇంటింటికి సుక్షిత నీరు, కూడళ్లలలో హైమాస్ట్ లైట్ల ఏర్పాటు వంటి మౌళిక సదుపాయాలు కలిపించినట్లు కౌన్సిలర్ కొడే మహేష్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రమేష్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

మల్కాజిగిరి: మర్రి రాజశేఖర్‌రెడ్డి ఫౌండేషన్, అరుంధతి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం నేరెడ్‌మెట్‌లోని అంబేడ్కర్ భవన్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పేద ప్రజల కోసం మర్రి రాజశేఖర్‌రెడ్డి అరుంధతి ఆస్పత్రి ద్వారా వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడమే కాకుండా ఉచితంగా వైద్యం అందిస్తున్నారని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.వైద్య శిబిరానికి వచ్చిన వారికి వైద్య పరీక్షలతో పాటు అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

బీజేపీని అధికారంలోకి తేవాలి



బాలాజీనగర్‌లో జెండా ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్: రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకరావడానికి ప్రతీ కార్యకర్త రెండు నెలల పాటు విశ్రాంతి లేకుండా పార్టీ కోసం పని చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు జగన్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని బాలాజీనగర్ పార్టీ జెండాను ఆవిష్కరించి ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లాలోని 5 నియోజకవర్గాలలో బీజేపీ బలంగా ఉందని కార్యకర్తలు, నాయకులు మరింత కష్టపడి పార్టీ అభ్యర్థులను గెలిపించడానికి పని చేయాలని అన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌దాస్, నాయకులు సుధాకర్‌రెడ్డి,శ్రీనివాస్‌గౌడ్, రాఘవరెడ్డి, సీఎంరాజు, పికెట్ నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఘట్‌కేసర్: పట్టణంలోని జెడ్పీ బాలుర పాఠశాలలో 1998–99 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం స్థానిక నారాయణ గార్డెన్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. బాల్యస్మృతులు గుర్తుచేసుకొని ఆనందసంద్రంలో మునిగితేలారు. తమ ఉపాధ్యాయులు సుధీర్‌రెడ్డి, సాయిరెడ్డి, కృపానందం, సలీం, భద్రారెడ్డి, శ్రీనివాసశర్మ, రమేశ్‌కుమార్, వినయ్‌కుమార్, హర్మతరెడ్డిని పూలమాల, శాలువాతో సత్కరించి మెమొంటో అందజేశారు.

కంటికి రెప్పలా కాపాడుకుంటా

కాప్రా: ఉప్పల్ నియోజకవర్గాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటానని తెలిపారు బీఆర్ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఏఎస్‌రావునగర్ డివిజన్‌లోని అనుపురం కమ్యూనిటీ హాల్‌లో డివిజన్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎల్ఆర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని, సంక్షేమ పథకాలతో ఎంతో మంది లబ్దిపొందారని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైనా రానివారుంటే ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని..తాను అండగా ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వచ్చేలా కృషి చేస్తానని తెలిపారు.

అవుషాపూర్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా వామన్‌రెడ్డి



వామన్‌రెడ్డిని శాలువాతో సత్కరిస్తున్న అవుషాపూర్ వాసులు

ఘట్‌కేసర్: అవుషాపూర్ గ్రామశాఖ అధ్యక్షుడిగా కవాడీ వామన్‌రెడ్డి ఆదివారం ఎన్నికయ్యారు. గ్రామంలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. అనతరం ఆయను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జంగయ్యముదిరాజ్, మాధవరెడ్డి, రమేశ్, సందీప్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, జగదీశ్, నరేశ్, కృష్ణ, నరసింహా, బడే సాబ్, భానుగౌడ్, సాయిగౌడ్, నరేశ్‌గౌడ్, సుధాకర్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



జవహర్‌నగర్: విద్యార్థులు విద్య, క్రీడా, సాంస్కృతిక రంగాల్లో రాణించాలని తైక్వాండో మాస్టర్ నరేందర్‌యాదవ్ అన్నారు. ఆదివారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని 26వ డివిజన్ కమ్యూనిటీ హాలులో తైక్వాండో పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బెల్టులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాస్టర్ నరేందర్‌యాదవ్ మాట్లాడుతూ.. విద్యార్థి దశ చాలా కీలకమైందన్నారు. వారి బాల్యం నుండే మంచి లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలన్నారు.

ఎన్ఆర్ఈసీలో ఘనంగా ఫ్రెషర్స్ డే



మేడ్చల్ రూరల్: విద్యార్థి దశ ఎంతో విలువైందని, విద్యార్థి దశలో కష్టపడితేనే భవిష్యత్ ఆనందంగా గడపవచ్చని నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల చైర్మెన్ నర్సింహ్మారెడ్డి, సెక్రటరీ త్రిశూల్‌రెడ్డిలు అన్నారు. కళాశాలలో మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులను ఆహ్వానిస్తూ సీనియర్స్ ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు కృషి, పట్టుదల, క్రమశిక్షణ ఎంతో అవసరం ఉన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సంగీతరెడ్డి, డైరెక్టర్ మోహన్‌బాబు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ కార్పొరేట్ పార్టీ అయింది'



జవహర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న మాజీ సర్పంచ్ కారింగుల శంకర్‌గౌడ్

జవహర్‌నగర్: బీఆర్ఎస్ కార్పొరేట్ పార్టీ అయిందని ఆ పార్టీకి కార్యకర్తలు అవసరంలేదని, విద్య, వైద్య రంగాలను నిర్వీర్యం చేశారని జవహర్‌నగర్ మాజీ సర్పంచ్ కారింగుల శంకర్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం జవహర్‌నగర్‌లోని అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌లో కుల, ప్రజా సంఘాలు, మాజీ ఎంపీటీసీలు, వార్డు సభ్యులలతో కలిసి ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కారింగుల శంకర్‌గౌడ్ మాట్లాడుతూ లక్షల జనాభా ఉన్న జవహర్‌నగర్‌లో ఐటీఐ కళాశాలను ఏర్పాటు చేయకుండా ఇతర ప్రాంతాలకు తరలించి స్థానిక యువతకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. గత కాంగ్రెస్ హయాంలో ఏర్పాటు చేసిన పాఠశాలలు తప్ప కొత్తగా ఏమి చేయలేదన్నారు. విద్యా, వైద్య సదుపాయాలు కల్పించడంలో విఫలమైయ్యారన్నారు. బాలాజీనగర్‌లో 100 ఫీట్లను చేయాల్సిన రహదారి నిర్మాణాన్ని 60 ఫీట్లకే చేసి చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో జవహర్‌నగర్ కుల, ప్రజా సంఘాల నాయకులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ వార్డు సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పురపాలికల్లో మరమ్మతులేవీ...!

- పట్టణాల్లో అధ్వానంగా ప్రధాన , అంతర్గత రోడ్లు
- డ్రైనేజీలు ...చెత్త సమస్య అంతే..
- ముక్కు పిండి పన్నులు వసూలు చేసినా...పట్టించుకోనని పురపాలికులు



సాక్షి, మేడ్చల్ జిల్లా: నగర శివారు పురపాలక సంఘాల్లో ప్రజలు ప్రధానంగా రోడ్లు, డ్రైనేజీ సమస్యను ఎదుర్కొంటున్నారు. పురపాలికలు పట్టణాల్లో ప్రధాన, అంతర్గత రోడ్లు గుంతలుగా మారినా... మురికి కాలువలు దెబ్బతిన్నా... మరమ్మతులు చేపట్టకపోవడంతో పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్త రోడ్లు, మురికి కాలువల నిర్మాణం అటుంచితే...వర్షాలతో తరచుగా దెబ్బతింటున్న రోడ్లు, డ్రైనేజీల మరమ్మతులను పురపాలికలు పట్టించుకోకపోవడంతో ఆగ్రహం వెల్లువెత్తుతోంది.

- పీర్జాదిగూడ, బోడుప్పల్ నగర పాలక సంస్థల్లో భారీ వర్షాల కారణంగా దాదాపు 10 కిలో మీటర్ల ప్రధాన రోడ్లు, మురికి కాలువలు దెబ్బతిన్నాయి. వీటి నిర్మాణానికి ప్రభుత్వం ఎస్ఎన్‌డీపీ కింద రూ.110 కోట్లు విడుదల చేయగా, అదనంగా 31శాతం నిధులను సంబంధిత నగర పాలక సంస్థలు కంట్రిబ్యూషన్ కింద చెల్లించటం ద్వారా పనులు చేపట్టాలని సూచించింది. ఈ నిధులు విడుదలై ....దాదాపు ఏడాది గడిచినా రోడ్ల, డ్రైనేజీ నిర్మాణ పనులు మాత్రం నత్తకు నడక నేర్పుతున్నాయి.
- నాగారం మున్సిపాలిటీలో కొమటకుంట నుంచి దాయారకుంట వరకు రోడ్డు డ్రైనేజీ నిర్మాణానికి రూ.8 కోట్లు నిధులు విడుదలైనా ... పనులు మాత్రం జాప్యంగా సాగుతున్నాయి.
- నాగారం నుంచి వయా రాంపల్లి మీదుగా ఘట్కేసర్ వరకు ఉన్న 50 అడుగుల ప్రధాన రోడ్డును 100 అడుగుల రోడ్డుగా అభివృద్ధి చేయాలన్న ప్రతిపాదనలను పురపాలికలు పట్టించుకోకపోవటంతో..ముందుకు సాగని పరిస్థితి నెలకొంది.
- దమ్మాయిగూడ మున్సిపాలిటీలో పలు రోడ్లు, డ్రైనేజీ పనులకు రూ.18 కోట్లు మంజూరు కాగా, పనులు వేగవంతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.అలాగే, జవహర్ నగర్ తోపాటు నిజాంపేట, ఘట్కేసర్, పోచారం, కొంపల్లి, దుండిగల్, గుండ్లపోచంపల్లి, తూముకుంట, మేడ్చల్ పురపాలక సంఘాల్లో దర్శనమిస్తున్నాయి.

ముక్కు పిండి పన్నులు ...

- గ్రేటర్ శివారు మేడ్చల్ జిల్లాలో నాలుగు కార్పొరేషన్లు, 9 మున్సిపాలిటీల ప్రజల నుంచి ముక్కు పిండి వివిధ రకాల పన్నులను ప్రతీ ఏటా రూ.221 కోట్లు వసూలు చేస్తున్నా.. వారికి సేవలను అందించటంలోనూ, సమస్యలను పట్టించుకోవటంలోనూ పూర్తిగా పాలకులు విఫలమవుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.15వ ఆర్థిక సంఘం నుంచి కూడా ప్రతి నెల ఒక్కో పురపాలక సంఘానికి రూ.3 లక్షల నుంచి రూ.21 లక్షల నిధులు విడుదల అవుతున్నప్పటికీ సమస్యలు పరిష్కారానికి నోచుకోవటం లేదు. పట్టణ ప్రగతి పేరుతో ప్రభుత్వం పురపాలక సంఘాల అభివృద్ధికి బాటలు వేస్తున్నప్పటికీ పాలక వర్గాలు, అధికారగణానికి పట్టణ ప్రగతి పట్టటం లేదు. పైగా అక్రమ నిర్మాణాలు, వెంచర్లు, లేఅవుట్లతో అక్రమంగా వచ్చే సంపాదనను మాత్రం పురపాలికల్లో పలువురు ప్రజా ప్రతినిధులు,ఉద్యోగులు వాటాల రూపేనా పంచుకోవటంలో మాత్రం వెనుకాడటం లేదన్న ఆరోపణలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి.